ట్రిపుల్ ఆర్‌పై నేడు కీలక సమావేశం

మంత్రి కోమటిరెడ్డితో ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల భేటీ

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిపుల్ఆర్) పురోగతిపై మంగళవారం కీలక సమావేశం జరగనున్నది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు సచివాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో భేటీ కానున్నారు. ట్రిపుల్ఆర్ యుటిలిటీ షిఫ్టింగ్, భూసేకరణతోపాటు టెండర్ల ప్రక్రియ, దక్షిణ భాగం రోడ్డు ప్రణాళికకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణలో ఇప్పటికే దాదాపు 90% వరకు పూర్తవడంతో ప్యాకేజీలవారీగా టెండర్లు పిలవాలని నిర్ణయించారు. కానీ, రాయగిరి ప్రాంతంలో భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరించడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను స్వల్పంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ అందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పుకోలేదని తెలుస్తున్నది. ట్రిపుల్ఆర్ దక్షిణ భాగం పనులకు కూడా కేంద్రం ఇదివరకే అంగీకారం తెలపడంతో అలైన్‌మెంటు ఖరారు, నంబరు కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది. ట్రిపుల్ ఆర్ పనులను ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలోనే చేపట్టాలని, తద్వారా భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించుకునేందుకు వీలవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ట్రిపుల్ఆర్ పనులను చేపడితే స్థానికంగా ఏర్పడే సమస్యలపై నిర్ణయం తీసుకునేందు చాలా సమయం పడుతుందని, దీనివల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నది. అందుకే మొత్తం ట్రిపుల్ఆర్ పనులను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టేందుకు అనుమతివ్వాలని కోరుతున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం జరగనున్న సమావేశం చాలా కీలకమైనదని అధికారులు అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో పైలట్ మృతి

శ్రీకరన్‌రెడ్డి(ఫైల్)

కీసర, జూలై 8: కీసర ఔటర్ రింగ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో శిక్షణలో ఉన్న పైలట్ శ్రీకరణ్‌రెడ్డి (26) మృతి చెందాడు. గజ్వేల్‌కు చెందిన శ్రీకరణ్.. నగరంలోని నేరేడ్‌మెట్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కారులో కీసర మీదుగా ఘట్కేసర్ నుంచి యాదగిరి గుట్టకు బయలుదేరాడు. కీసర సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు మీద కారు బోల్తా కొట్టి, అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే, కారును ఏదైనా వాహనం ఢీకొట్టిందా? అన్న కోణంలో కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకరణ్.. బ్యాంకాక్‌లో పైలట్ శిక్షణ పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

విజయవాడ-బెంగళూరు మధ్య డైలీ ఫ్లైట్

ఇప్పటికే విజయవాడ-ముంబై సర్వీసు ప్రారంభం

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): ఏపీ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుంది. విజయవాడ-బెంగళూరు మధ్య ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ డైలీ ఫ్లైట్ నడపనుంది. సెప్టెంబర్ ఒకటి నుంచి విజయవాడ-బెంగళూరు మధ్య విమాన సర్వీసులు తిరుగనున్నాయి. టికెట్ ధరలు ఎకానమీ క్లాసులో రూ.5వేల వరకు ఉంది. ప్రతిరోజూ సాయంత్రం 4.05 గంటలకు బెంగళూరులో బయల్దేరనున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ IX2516 విమానం 5.40 గంటలకు విజయవాడ చేరుతుంది. విజయవాడ నుంచి సాయంత్రం 6.10 గంటలకు బయల్దేరి రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుతుంది. మరోవైపు విజయవాడ-ముంబై మధ్య జూన్ 15 నుంచి ఎయిరిండియా డైలీ సర్వీస్ ప్రారంభమైంది. రోజూ సాయంత్రం ముంబైలో బయల్దేరనున్న ఈ విమానం 5.45 గంటలకు గన్నవరం చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.10కి గన్నవరంలో బయలుదేరి రెండు గంటల్లో ముంబై చేరుకుంటుంది. ఈ విమానంలో ప్రారంభ ధరను రూ.5,600గా నిర్ణయించారు.

అటవీ భూమిలో మైనింగ్‌పై నోటీసులు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా సుల్తాన్‌పూర్ రిజర్వ్ ఫారెస్టులో భూముల ఆక్రమణల ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన సాగర్, నాగార్జున సిమెంట్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. అటవీ ప్రాంతంలో సాగర్ సిమెంట్స్ లిమిటెడ్, ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అక్రమ మైనింగ్ వ్యవహారంపై అధికారులకు తెలిసి చర్యలు తీసుకోవడం లేదని న్యాయవాది కర్నాటి వెంకటరెడ్డి ప్రజాహిత వ్యాజ్యం వేశారు. దీనిపై జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించి ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

కోనోకార్పస్ మొక్కలు ప్రాణాంతకం

- ఏపీలో నిర్మూలిస్తున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం
- తెలంగాణలో కోట్ల సంఖ్యలో విషపు మొక్కలు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): పర్యావరణంలోని అన్ని రకాల చెట్లు మనకు మేలు చేస్తాయని అనుకోకూడదని, హాని చేకూర్చే చెట్లూ కూడా ఉన్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అటువంటి ప్రమాదకరమైన మొక్కల్లో కోనోకార్పస్ ఒకటి. మాంగ్రూవ్ మొక్కలుగా పిలిచే వీటిని అవగాహన లేక రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యలో విరివిగా నాటుతున్నారు. పచ్చదనం, అందం కోసం పెంచే ఈమొక్కల వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనోకార్పస్ వృక్షాల పుప్పొడి అత్యంత ప్రమాదకరమైనదని, కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బంది పడతాడో ఈ చెట్ల నుంచి వచ్చే గాలిని పీల్చేవారు కూడా అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ మొక్కలను సమూలంగా నిర్మూలించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడలో ఇప్పటికే 5వేల వరకు మొక్కలను తొలగించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా అటవీశాఖ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. తెలంగాణలో దాదాపు 10 కోట్లకు పైగా కోనోకార్పస్ మొక్కలు ఉన్నట్టు అంచనా. ఏపీలో వాటిని నిర్మూలిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో కూడా వాటిని తొలగించాలని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని అటవీశాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఆ మొక్కలను కొత్తగా ఎక్కడా నాటడం లేదని చెప్పారు.

ఉదయనాథ్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా నియమితులైన కోట్ల ఉదయనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐఆర్ఏఎస్ అధికారి అయిన ఆయన సోమవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ కాగా, ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తిచేశారు.

'రెండు కండ్లు' అంటే ఏపీకి ద్రోహమే

చంద్రబాబు వ్యాఖ్యలపై అంబటి ఫైర్

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): తనకు 'రెండు తెలుగు రాష్ట్రాలు.. రెండు కండ్లు' అని ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు మండిపడ్డారు. రెండు రాష్ట్రాలు .. రెండు కండ్లు అంటే అర్థమేంటని ప్రశ్నించారు. సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ డిమాండ్లను అంగీకరించినట్టేనా అని చంద్రబాబును నిలదీశారు. బాబు మాటలు వింటుంటే ఏపీకి ఏదో ద్రోహం తలపెట్టినట్టు అనిపిస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల సమస్యలపై ఇద్దరు సీఎంలు ఎందుకు చర్చించలేదు? అని అంబటి ప్రశ్నించారు. ఏపీలోని పోర్టులో తెలంగాణ వాటా అడుగుతున్నదని.. టీటీడీ బోర్డు, ఆదాయంలోనూ వాటా కోసం తెలంగాణ పట్టుబట్టిందని పేర్కొన్నారు. తెలంగాణకు వాటా ఇవ్వడానికి చంద్రబాబు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. పార్టీ పరంగా బాబుకు రెండు రాష్ట్రాలు.. రెండు కండ్లు కావచ్చు. కానీ, ఏపీ ప్రభుత్వపరంగా చంద్రబాబు వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనతో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విభజన జరిగాక పదేండ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. దాన్ని వినియోగించుకోకుండా చంద్రబాబు ఎందుకు పారిపోయి వచ్చారు? అని ప్రశ్నించారు.

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా సదస్సులు

- ఈ నెల 17 నుంచి 25 వరకు..
- వామపక్ష పార్టీల పిలుపు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మైనార్టీల మీద విస్తృత దాడులు చేస్తున్నాయని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. సోమవారం హైదరాబాద్‌లో వామపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. మెదక్‌లో ఆస్తుల విధ్వంసంతోపాటు బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, జనగామలో గోరక్షణ పేరుతో దాడులు చేశారని ఆరోపించారు. నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కావడంతో దేశవ్యాప్తంగా ఘర్షణలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకునే ప్రయత్నాలను వ్యతిరేకించాలన్నారు. ఇందుకోసం తెలంగాణ ప్రజానీకాన్ని చైతన్యపరిచేందుకు వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ నెల 17 నుంచి 25 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, నర్సింహ, రమా, రామచందర్, గోవర్ధన్, శ్రీనివాస్, పాపయ్య, సుధాకర్, రవితేజ, జానకిరాములు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ బ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించే పబ్బులు,బార్లు, క్లబ్బులపై కఠిన చర్యలు చేపడతామని డీజీపీ రవిగుప్తా సోమవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. వాటి నిర్వాహకులను, డ్రగ్స్ సరఫరాదారులను జైలుకు పంపడంతోపాటు వారి ఆస్తులను సీజ్ చేస్తామని తెలిపారు.టీనేజ్ పిల్లలని తల్లిదండ్రులు గమనిస్తూండాలని పోలీసు శాఖ ఎక్స్ వేదికగా విన్నవించింది. ఈ విషయంలో అనుమానంగా వెంటనే డయల్ 100కి కాల్ చేయాలని సూచించింది.

5 కోట్ల విలువైన డ్రగ్స్ దహనం

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 3,891.813 కిలోల డ్రగ్స్‌ను రాచకొండ పోలీసులు సోమవారం దహనం చేశారు.వీటి విలువ రూ.5,03,31,483 ఉంటుందని సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఇందులో 3,484.465 కిలోల గంజాయి, 402.200 కిలోల ఓపీఎం, 14 గ్రాముల ఎండీఎంఏ, 3.5 కిలోల హాష్ ఆయిల్, 45 గ్రాముల మెఫెడ్రోన్, 958 గ్రాముల ఛారస్, 100 గ్రాముల గంజాయి చాక్లెట్లు ఉన్నాయని తెలిపారు.

గురుకుల బది 'లీలలు'!

- ఉత్తర్వులకు విరుద్ధంగా మార్గదర్శకాలు
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు గరం గరం

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): దేవుడు వరమిచ్చినా పూజరి కరుణించలేదనట్టుగా తమ పరిస్థితి తయారైందని గురుకుల సొసైటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బదిలీలకు అనుమతులిస్తూ ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినా, సొసైటీ ఉన్నతాధికారులు వాటిని తుంగలో తొక్కుతున్నారని మండిపడుతున్నారు. ఒక్కో సొసైటీ ఒక్కో మార్గదర్శకాలను అనుసరిస్తూ తమ అవకాశాలను దెబ్బకొడుతున్నాయని వాపోతున్నాయి. మైనార్టీ గురుకులం నాలుగేండ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీ అవకాశాన్ని కల్పిస్తున్నా, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మార్గదర్శకాలను రూపొందించాయని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన సడలింపును గురుకుల సొసైటీలకు వర్తింపజేస్తూ ఎనిమిదేండ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకే బదిలీ అవకాశాన్ని కల్పించాయని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీల తీరుతో 2018, 2019లో రిక్రూట్‌మెంట్ అయి ఆరేండ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారందరూ నష్టపోవాల్సి వస్తున్నదని ఆయా సొసైటీల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఫైనాన్స్ జీవోను అమలు చేస్తే ఆయా డిపార్ట్‌మెంట్ల పర్మిషన్ అవసరం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివరిస్తున్నాయి. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఫైనాన్స్ జీవో 80కి విరుద్ధంగా మార్గదర్శకాలను రూపొందించడమేగాక, ఆయా డిపార్ట్‌మెంట్ల నుంచి పర్మిషన్ కూడా తీసుకోలేదని ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం జారీచేసిన ప్రధాన మార్గదర్శకాలు

- జూన్ 30 నాటికి ఒకేచోట కనీసం రెండేండ్ల సర్వీస్ పూర్తి చేసినవారు మాత్రమే బదిలీకి అర్హులు.
- జూన్ 30 నాటికి ఒకేచోట నాలుగేండ్లకు మించి పనిచేసిన ప్రతి ఒక్కరినీ బదిలీ చేయాలి.
- ఏ క్యాడర్‌లోనూ 40% మందికి మించి సిబ్బందిని బదిలీ చేయొద్దు.
- స్పౌజ్ కేసులు, 2025 జూన్ 30లోగా రిటైర్ అయ్యేవారు, 70% వైకల్యం కలిగిన ఉద్యోగులు, బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు, వితంతువులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, కఠిన ప్రదేశాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలి.

వాణిజ్య

భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

> *సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఈఎల్ ఉన్నదీ ఇక్కడే.*

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్-బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.

ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

కేసీఆర్ చొరవతో..

మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి ప్పుడు. మొత్తానికి ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్ద పీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

ప్రారంభ ధర రూ.66 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ-క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షలోనూ అంతే ఉండొచ్చంటున్నారు.

పీఎస్బీల్లో వాటాల్ని అమ్మేయండి

- ఇదే సరైన సమయం: ఎస్బీఐ నివేదిక
- సర్కారీ బ్యాంకులు ఇంకా తగ్గాలి

న్యూఢిల్లీ, జూలై 8: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్బీ)ల్లో వాటాల విక్రయానికి ఇదే సరైన సమయమని సర్కారీ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ సోమవారం తమ రిసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొన్నది. 'బ్యాంకులు ప్రస్తుతం పరిపుష్టంగా ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వానికి ఇదే సరైన సమయం. త్వరగా దీని